విలేకరులు కావలెను
మెదక్ టుడే తెలుగు దినపత్రిక, జ్వాల తెలుగు న్యూస్ చానల్‌లో పనిచేయుటకు, తెలంగాణ, ఏపీలో నియోజకవర్గ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను
వివరాలకు సంప్రదించండి
సి.హెచ్ శివ కుమార్
9494117870,
9553335493

RNI NO,TELTEL/2023/88524


# మెదక్ టుడే

తెలుగు దినపత్రిక MEDAK TODAY

సోమవారం, నవంబర్ 25 2024 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 49

## నేటి నుంచి పార్లమెంట్

- డిసెంబర్ 20 వరకు శీతాకాల సమావేశాలు
- వక్ఫ్ సహా 16 బిల్లులపై చర్చించే అవకాశం!
- అదానీ, మణిపూర్ అంశాలపై ఉభయసభల్లో
- నిలదీతకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ, నవంబర్ 24 :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్ తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి విపక్షం పట్టుబట్టవచ్చు. దేశమంతా ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన జమిలి ఎన్నికల బిల్లును లిస్టులో చేర్చకపోయినా దానిని ప్రవేశపెట్టవచ్చునని భావిస్తున్నారు. కాగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశంలో విజ్ఞప్తి చేసింది. అయితే అదానీ అవినీతి, మణిపూర్ అల్లర్లపై చర్చ జరగాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు.

**26న ప్రసంగించనున్న రాష్ట్రపతి**

రాజ్యాంగ ఆమోద 75వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభోత్సవానికి గుర్తుగా మంగళవారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాత పార్లమెంట్ భవనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాల్‌లో ప్రసంగిస్తారు. 'హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్' పేరుతో ఏడాది పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం తెలిపారు.

## సామాజిక మాధ్యమాల ద్వారా కోర్టులపై ఒత్తిడి

### కొందరు చేసే ప్రయత్నాలను జడ్జిలు గమనించాలి
### విశ్రాంత సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

**న్యూఢిల్లీ:** సామాజిక మాధ్యమాల ద్వారా కొన్ని వర్గాలు కోర్టు తీర్పులను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. ఈ విషయంలో న్యాయమూర్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్‌డీటీవీ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ ప్రభావం న్యాయమూర్తులపైన ఉంటుందా? అని ప్రశ్నించినపుడు ఆయన స్పందిస్తూ, 'నేడు ప్రత్యేక ఆసక్తిగల వర్గాలు, ఒత్తిడి తెచ్చే గ్రూపులు ఉన్నాయి. వీరు న్యాయస్థానాలను, కేసుల ఫలితాలను ప్రభావితం చేయడానికి సామాజిక మాధ్యమాలను వాడుకోవాలని ప్రయత్నిస్తుంటారు. ఓ తీర్పునకు ప్రాతిపదిక ఏమిటో తెలుసుకునే హక్కు, కోర్టు తీర్పులపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. అయితే, ఇది కోర్టు తీర్పులకు అతీతంగా, న్యాయమూర్తులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకున్నపుడు, ఇది నిజంగా వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛయేనా? అనే ప్రాథమిక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి' అని చంద్రచూడ్ చెప్పారు. నేటి ప్రజలు యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో 20 సెకండ్ల వీడి యోను చూసి, దాని ఆధారంగా అభిప్రాయం ఏర్పరచుకోవాలని అనుకు ంటున్నారని, ఇది చాలా ప్రమాదకరమని తెలిపారు. న్యాయమూర్తులు పదవీ విరమణ చేసిన తర్వాత రాజకీయాల్లో ప్రవేశించరాదని రాజ్యాంగం కానీ, చట్టాలు



కానీ చెప్పడం లేదన్నారు. సమాజం న్యాయమూర్తిని పదవీ విరమణ తర్వాత కూడా జడ్జిగానే చూస్తుందని, అందువల్ల ఇతరులు చేయడం సరైనదే అని భావించే పనులను న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత అయినా చేయడం సరైనది కాదన్నారు. సమాఖ్య వ్యవస్థలో కొలీజియం చాలా మంచి విధానమని చెప్పారు.

## మా ఇల్లు బఫర్‌జోన్ పరిధిలోకి రాదు

### హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు బఫర్ జోన్ లో, క్లారిటీ!



**హైదరాబాద్ :** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు బఫర్ జోన్ లో ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై ఏవీ రంగనాథ్ స్పందించారు. తన ఇల్లు బఫర్ జోన్ లో లేదని క్లారిటీ ఇచ్చారు. 44 ఏళ్ల క్రితం తన తండ్రి నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నామన్నారు. హైడ్రా పేరు చెబితే హైదరాబాద్ లో అక్రమ నిర్మాణదారులు వణికిపోతున్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లో ఉన్న నిర్మాణాలను హైడ్రా బుల్డోజర్లు కూల్చివేస్తున్నాయి. అయితే తాజాగా సోషల్ మీడియోలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు కూడా బఫర్ జోన్ లో ఉందని ప్రచారం జరుగుతోంది.

## దీక్షా దివస్.. 29న నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం : కేటీఆర్

**హైదరాబాద్ :** ఈ నెల 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నవంబర్ 29, 2009 న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజని మన అందరికీ తెలుసు అని కేటీఆర్ తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర కూడా ఎంతో ఘనమైనది. నాడు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలించడంతో.. నిమ్స్ కదన రంగంగా మారిపోయిన పరిస్థితి. మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన పరిస్థితి. కాబట్టి నవంబర్ 29న నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు. దీక్షా దివస్‌తో పాటు తెలంగాణ తల్లి విగ్రహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గులాబీ కుటుంబ సభ్యులకు పిలుపునిస్తున్నాను. ఆనాటి కార్యక్రమాలు, ఉద్యమ జ్ఞాపకాలను మళ్లీ గుర్తు



తెచ్చే విధంగా మీడియా కూడా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మళ్లీ రగిలించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఈ దుర్మార్గ కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలనే సంకల్పంతోనే ఈ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 'ప్రజాపాలన' విజయోత్సవాలు అదరాలి : సీఎం రేవంత్

హైదరాబాద్: ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజా పాలన విజయోత్సవాలునిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. విజయోత్సవ వేడుకలను అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజా పాలన - విజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. ఈ నెల 30వ తేదీన మహబూబ్‌నగర్‌లో రైతులకు అవగాహన కల్పించే రీతిలో రైతు సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి శాఖల వారీగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఈ వారంలో జరిగేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించాలని ఆ వేదికపై



గ్రూప్ 4తో పాటు వివిధ రిక్రూట్మెంట్ల ద్వారా ఎంపికైన 9వేల మందికి నియామక పత్రాలు అందించాలన్నారు. ఇక డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనేలా ప్రజా పాలన విజయోత్సవ ఉత్సవాలు నిర్వహించాలని రేవంత్ అన్నారు. ఈ మూడు రోజుల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో తెలంగాణ వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మూడు రోజుల పాటు తెలంగాణ సంస్కృతి, కళారూపాలతో పాటు మ్యూజికల్ షోలు, ఎయిర్ షో, కన్నుల పండువగా డ్రోన్ షోలు నిర్వహించాలన్నారు. రాష్ట్రమంతటా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ ప్రజా పాలన విజయోత్సవ వేడుకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉత్సవ వాతావరణం ఉట్టిపడాలని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీన సెక్రెటేరియట్ ముఖద్వారం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఆ రోజు సాయంత్రం జరిగే ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులను, మేధావులను, విద్యావంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## కూలిపోయిన కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా ఇస్తావ్.. సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

**హైదరాబాద్ :** ఒకవైపు కాళేశ్వరం నీళ్లతో మూసీ పునరుజ్జీవం చేస్తామని చెబుతున్నారని.. మళ్లీ ఇవే నీళ్లను హైదరాబాద్ తాగునీటి వసతి కోసం ఉపయోగిస్తామని ప్రకటిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇందులో ఏది నిజం అని ప్రశ్నించారు. మీరు చెబుతున్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోవడం నిజమా? దాని ద్వారా అందిన ప్రతిఫలం నిజమా? అని నిలదీశారు. గత ప్రభుత్వాల ఘనతను మెచ్చుకొని మెడలో వేసుకోకపోయినా పర్వాలేదు, కానీ అసలు ఏ ఘనత లేదని చెప్పుకోవడమే దుర్మార్గమని మండిపడ్డారు.

## సమగ్ర కుటుంబ సర్వే - డోర్ లాక్, వలసలు వివరాలను సేకరించండి: డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్:** సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైనదని.. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకండి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జార?ండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లుకు పలు సూచనలు చేశారు. డేటా ఎంట్రీ లో నాణ్యత చాలా ముఖ్యమైనది, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తేయా కాబట్టి వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమబద్ధకరించుకోవాలని, వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు.



గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధరీకరించుకోవాలి అని తెలిపారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. ఈ పాఠశాలలో ఆహారం మరియు పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ రకమైన సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం, జిహెచ్ఎంసి కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఢిల్లీకి సీఎం రేవంత్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశం అయ్యేందుకు సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లనున్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలపై అధిష్టానంతో చర్చించే అవకాశం ఉంది.



అలాగే ఉత్సవాలకు హాజరు కావాలని ఏఐసీసీ పెద్దలను కోరనున్నట్లు సమాచారం. సెక్రటేరియట్లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సభకు హాజరుకావాలని రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నట్టు తెలుస్తోంది. అలాగే కార్పొరేషన్ పదవులు, మంత్రివర్గ విస్తరణపై కూడా చర్చించనున్నట్లు సమాచారం.

# సత్యభామసమేత వేణుగోపాల స్వామి ఆలయం ప్రత్యేకత

**లోకంలో దీపాలకాంతులు వెలగడానికి దుష్టసంహారం రూపంలో చీకట్లు పారదోలే గొప్ప ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నంలో ప్రధాన భూమిక సత్యభామదే. అందుకే... దీపావళి పండుగలో ప్రధాన పాత్ర సత్యభామదే. ఈ కథనంలో కృష్ణుది సపోర్టింగ్ పాత్ర మాత్రమే. నరకాసుర వధ జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని దీపకాంతులతో ఆనందంగా నిర్వహించుకునే ఈ వేడుక అందరికీ తెలిసిందే. అయితే అంత గొప్ప మహిళకు ఆలయం ఎక్కడైనా ఉందా?... ఉంది.**


కార్వేటి నగరం ఆలయ ముఖద్వారం

అనంతపురం జిల్లా మడకశిర సమీపాన కృష్ణుని విగ్రహంతోపాటు సత్యభామ విగ్రహం కూడా ఉంది. ఇక్కడ కృష్ణాష్టమి వేడుకల కంటే మిన్నగా దీపావళి వేడుకలు జరుగుతాయి. అలాగే చిత్తూరు జిల్లా కార్వేటి నగరంలో కృష్ణుడితోపాటు సత్యభామ పూజలందుకుంటోంది. ధీర వనిత సత్యభామను పూజలందుకునే పౌరాణిక పాత్రగా గౌరవించింది మన సంస్కృతి. ఈ పండుగలో సత్యభామది నాయిక పాత్ర అయితే ప్రతినాయక పాత్ర నరకాసురుడిది. నరకాసురుడికి ఆలయం లేదు కానీ, అస్సాంలో నరకాసురుడు కట్టించిన ఆలయం ఉంది. అది గువాహటిలోని కామాఖ్య ఆలయం. చిత్తూరు జిల్లా, కార్వేటి నగరంలో సత్యభామసమేత వేణుగోపాల స్వామి ఆలయానికి ఓ విశిష్టత ఉంది. తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారితో పూజ లందుకొంటున్న రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామి మూర్తులను కార్వేటి నగరానికి తెప్పించి వైఖానసులచే ప్రతిష్ఠించినట్లు పురాణ కథనం. ఆకాశరాజు వంశానికి చెందిన నారాయణరాజుకు సంతానం లేకపోవడంతో తపస్సు చేసినట్లు, అదే వంశానికి చెందిన వెంకట పెరుమాళ రాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం. ఈ ఆలయంలో శిల్పనైపుణ్యం అద్భుతంగా ఉంటుంది. ఆలయంలో


రాణి మహల్

మకరతోరణం, రుక్మిణి, సత్యభామ సమేత వేణుగో పాలస్వామి విగ్రహాలను ఏకశిలతో రూపొందించడం విశేషం. గాలి గోపురానికి ఎదురుగా ఉన్న 105 అడుగుల ధ్వజస్తంభం ఏకశిల నిర్మితం.

**14 ఎకరాల పుష్కరిణి**

ఈ ప్రాంతాన్ని 19వ శతాబ్దంలో తీవ్రమైన కరువుపీడించింది. అప్పుడు ప్రజలను కాపాడేందుకు కార్వేటినగరం సంస్థానధీశుడు వెంకట పెరుమాళ్ రాజు 14 ఎకరాల విస్తీర్ణంలో స్కంధపుష్కరిణిని నిర్మించాడు. ఏ దిక్కు నుంచి చూసినా నీటి మట్టం సమాంతరంగా కనిపించడం దీని


స్కంద పుష్కరిణి

నిర్మాణ విశిష్టత. పుష్కరిణి మెట్ల మీద దేవతామూర్తులు, సర్పాలు, శృంగార శిల్పాలు నాటి శిల్పకళకు ప్రతిబింబిస్తున్నాయి. పుష్కరిణి కోసం పని చేసిన వారికి వెంకట పెరుమాళ్ రాజు స్వయంగా దోసిళ్లతో నాణేలను ఇచ్చారని స్థానిక కథనం. ఇక్కడి చెరువుకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ చెరువు నుంచి ఏడు బావులకు నీరు సరఫరా అవుతుంది. ఏడు బావుల నుంచి స్కంద పుష్కరిణికి చేరుతుంది. కార్వేటి నగరంలో చూసి తీరాల్సిన మరో నిర్మాణం రాణి మహల్ (అద్దాల మహల్). ఈ మహల్ నిర్మాణంలో కోడిగుడ్డు సొన ఉపయోగించిన కారణంగా


రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల ఆలయం

ఇప్పటికీ పటిష్టంగా ఉండడంతోపాటు నీటితో తుడిస్తే గోడలు అద్దంలా మెరుస్తుంటాయి. అందుకే దీనికి అద్దాల మహల్ అనే పేరు వచ్చింది. ఏపీ టూరిజం నిర్వహించే ప్యాకేజ్ టూర్‌లో తిరుమలతోపాటు చంద్రగిరి, నారాయణవనం, నాగులాపురం, కార్వేటి నగరం ఉంటాయి.


ఏకశిల ధ్వజస్తంభం

## బరువు తగ్గాలని బ్రేక్‌ఫాస్ట్ మానేస్తున్నారా.. అయితే..

**ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడంతోపాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు తలెత్తే ప్రమాదం తగ్గుతుంది. అధిక బరువు... టైప్ 2 డయాబెటిస్, కొన్ని క్యాన్సర్లు, గుండె జబ్బులు వంటి అనారోగ్య పరిస్థితులకు దారితీస్తుంది.**




అలాగే, తక్కువ బరువు ఉండటం కూడా ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారం తీసుకోవడం తగినంత బరువుతో ఆరోగ్యకరంగా జీవించడానికి సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను ఎంత చిన్న వయసులో ఆరంభిస్తే అంత మంచిది. అయితే, అలా ఆరంభించలేకపోయినందుకు విచారించవద్దు. మీరు ఇప్పుడు నలభైలలో ఉన్నారనుకోండి, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను, జీవన శైలిని ఇప్పటినుంచి ఆరంభించినా, కనీసం అయిదారేళ్లకుపైగా జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చు. అదే అరవైలలో అయితే నాలుగయిదేళ్లు అదనంగా ఆరోగ్యకరంగా జీవించవచ్చు. అన్నిటికన్నా ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం ఆరోగ్యకరమైన ఆహారంతోపాటు ఆరోగ్యకరమైన ఆలోచనలు కూడా అలవరచుకోవాలి. సానుకూలమైన ఆలోచనలు, స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం కూడా అవసరం. కనీసం ఇప్పుడైనా, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటే జీవిత కాలాన్ని పొడిగించుకుని ఆరోగ్యంగా... ఆనందంగా జీవించవచ్చు.

అల్పాహారం మానద్దు కొంతమంది అల్పాహారం తినడం తగ్గిస్తే బరువు తగ్గుతామని భావిస్తారు. కానీ ఫైబర్ అధికంగా ఉండే ఆరోగ్యకరమైన అల్పాహారం సమతుల్య ఆహారంలో భాగం అవుతుంది. మంచి ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను పొందడానికి సహాయపడుతుంది కాబట్టి బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేక్ వేయకూడదు.

తక్కువ ఉప్పు... తక్కువ ముప్పు! ఎక్కువ ఉప్పు తినడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అధిక రక్తపోటు గుండె వ్యాధులకు దారితీస్తుంది కాబట్టి రుచి కోసం అదనపు ఉప్పును తీసుకోవడం తగ్గించాలి.

## ఈ నౌకకు ఇంధనం అక్కరలేదట! కేవలం గాలితోనే...

చిన్న చిన్న పడవలైతే గాలివాలుకు అలా ముందుకు సాగిపోతాయి గాని, భారీ నౌకలు సముద్రంలో ముందుకు సాగాలంటే ఇంధనం కావాలి కదా! కేవలం గాలితో ఇంత పెద్ద నౌక సముద్రంలో ఎలా ప్రయాణం సాగించగలుగుతుందనేగా మీ అనుమానం? ఇందులో అణుమాత్రమైనా అనుమానానికి ఆస్కారం లేదు. ఫొటోలో కనిపిస్తున్న ఈ నౌక పూర్తిగా గాలి ఆధారంగానే నడుస్తుంది. కెనడాకు చెందిన 'కేఫ్ విలియమ్' తన అంతర్జాతీయ కాఫీ రవాణా కోసం ప్రత్యేకంగా తయారు చేయించుకున్న ఈ నౌక పూర్తిగా పవనశక్తినే ఇంధనంగా మార్చుకుని, సముద్రంలో ప్రయాణిస్తుంది. 'కేఫ్ విలియమ్' కోసం 'సెయిల్ కార్గో' సంస్థ ఈ నౌకను ప్రత్యేకంగా రూపొందించింది. ఈ నౌక 2023లో తొలి సముద్రయానం చేయనుంది.




## ప్రకృతే నేస్తం.. ప్రకృతే పరమాత్మ..!

**చిన్న..చిన్న మొక్కలే ఓ పెద్ద వనం అవుతుంది. మనం నాటిన మొక్కే మనకు నీడను ఇస్తుంది, ప్రాణ వాయువు ఇస్తుంది. మానవ జీవితంలో మనం చేయాల్సిన ముఖ్య విధానం ప్రకృతి పరిరక్షణ. ప్రకృతి అనేది భగవంతుడే ఏర్పరచిన ఓ అద్భుత సంపద. దాన్ని వినాశనానికి గురి చేయకుండా ప్రకృతి పట్ల అర్థవంతంగా నడచుకో అనే సందేశాన్ని ప్రతి వారు గ్రహించాలి. అప్పుడే ప్రకృతికి పరమార్థం ఇచ్చినట్లు అవుతుంది.**




ఈ ప్రకృతి ఏర్పడటమే ఓ విచిత్రం. చెట్లు, చేమలు, వివిధ జంతువులు, విహంగాలు, నదులు, పర్వతాలు... ఇవన్నీ ఎవరి సృష్టి అని ప్రశ్నించుకుంటే ఆశ్చర్యం అనిపిస్తుంది. సృష్టికర్త ఆజ్ఞ వలన ఈ సృష్టి ఏర్పడింది. సృష్టిని నిర్మించింది ఆ పరమాత్మనే అనే మాట వినిపిస్తుంది. పరమాత్మ ప్రకృతికి ప్రాణం పోస్తే, పరమాత్మ ద్వారా సృష్టించబడిన మానవుడు నేడు ప్రకృతి వినాశనానికి కారకుడు అవుతున్నాడు. స్వేచ్ఛగా చెట్లు నరకడం, అనువుగాని చోట్ల నిర్మాణాలు చేయడం, పర్యావరణానికి విఘాతం కలిగించే కలుషిత కర్మాగారాలు స్థాపించడం వంటి వాటి వలన ప్రకృతి పాడవుతున్నది. మానవుడు తన స్వలాభాలను చూసుకుంటున్నాడే గాని పదిమందికి ఉపయోగపడే ప్రకృతికి ప్రాణం పోయాలి అనే విషయం మరచి నట్లు ఉన్నాడు. విచ్చలవిడిగా వ్యర్థ పదార్థాలను ధరణిపై వేసి ప్రకృతి నిరోధానికి పరోక్షంగా కారకుడు అవుతున్నాడు. ప్రకృతి అనేది ఓ దైవం అనే మాటను విస్మరిస్తున్నాడు. పచ్చని ప్రకృతిని ఓ క్షణం పరిశీలిస్తే మనసు ఆనందంతో నిండిపోతుంది. ప్రకృతిలోని పక్షుల కిల.. కిల రావాలు, పారే సెలయేర్లు, శబ్దం చేసే పాల పొంగులాంటి జలపాతాలు, అందంగా పేర్చినట్లు ఉండే పర్వత శ్రేణులు చూస్తుంటేనే ఓ మధురానుభూతికి లోనవుతాం. రోజు కొంత సేపు ప్రకృతిలో విహరిస్తే మనం పొందే అనుభూతే వేరు. అయితే నేడు చాలామంది వాకింగ్ వంకతో ప్రకృతిని ఆస్వాదిస్తామంటారే కానీ వాళ్ళు ఆస్వాదించేది అంతా వాళ్ళ చెవులలో పెట్టుకుని వినే పాటలే. ఈరోజుల్లో ఎక్కడ చూసినా ఇయర్ ఫోన్లు పెట్టుకునే వారే కనిపిస్తారు. వాళ్ళు ఏమి ఆస్వాదిస్తున్నారో, ఏమి వింటున్నారో అర్థం కాదు. మనం ప్రయాణిస్తున్నప్పుడు కనపడే చెట్టు, చేమ చూడటం వలన ఓ ఆనందం కలుగుతుంది. ఈ విశ్వంలో జరిగే కార్యాలు అన్నీ ప్రకృతి వల్లనే జరుగుతూ ఉంటాయి. కానీ అహంకారం, గర్వం కారణం మూలంగా మనిషి మాత్రం తానే అన్నిటికీ కర్తనని, మూలం తానేననీ, తన ప్రయోజకత్వం వల్లనే అన్ని కార్యాలు జరుగుతున్నాయని భావిస్తూ ఉంటాడు. ఏ వ్యక్తి అయినా 'నేను చేస్తున్నాను' అనుకోకపోతే ఏ పనినీ చేయలేడు. చిక్కు అంతా ఎక్కడ వస్తుందీ... అంటే సమస్తం నేను చేస్తున్నాను. నా వల్లే అన్నీ జరుగుతున్నాయి అని అహంకార పూరితుడిగా మారినప్పుడే. అప్పుడే వ్యక్తి పతనపు అంచులకు ప్రయాణం సాగిస్తున్నాడని తెలుసుకోవాలి. ఇటువంటి అహంకారం మానవుణ్ణి కిందకు లాగుతుంది. సత్వ రజస్తమోగుణాలతో కూడిన ఈ ప్రకృతిని అధిగమించడం కష్టం. ఈ సువిశాల విశ్వమంతా చాలా వరకు అన్ని కార్యాలు ప్రకృతి పర్యవేక్షణలోనే జరిగిపోతూ ఉంటాయి. భూమిలో విత్తనం వేసి నీళ్ళు పోయాడమే మనం చేయగలిగేది. కాని ఆ విత్తనం నుండి మొలక రావడం, మొక్క పెరగడం, అది కిరణ జన్య సంయోగ క్రియ ద్వారా సూర్యుని నుండి ఆహారం స్వీకరించడం మొదలగు అన్ని క్రియలలో వ్యక్తి ఏమి చేయగలుగుతున్నాడో అని బేరీజు వేసుకుంటే విశ్వంలో జరిగే ప్రతి క్రియలో ప్రకృతి పాత్ర మిక్కుటం. తల్లి గర్భంలో ఫలదీకరణ చెందిన జీవి ఎన్ని మార్పులకు గురవుతుందో సరిగ్గా ఆచి తూచగలిగే జ్ఞానం, విజ్ఞానం మనకు ఇప్పటికీ అందుబాటులో లేదు. ఇది కేవలం ప్రకృతి ద్వారానే సాధ్యం. ఇంతటి మహత్తర కార్యం ప్రకృతి వలననే జరుగుతుండగా మనిషి 'నేనే కర్తను' అని అహంకరించడం ఏ మాత్రం సబబు? ఎప్పుడైతే నేనే అని అనుకుంటున్నాడో అప్పుడే నాది... నాదే అనే మమకారం మొదలవుతుంది. ఈ 'అహం', 'మమ' అనే రెండు భావాలే ఇరువైపులా నుండి వ్యక్తిని పతనం వైపుకు నెడతాయి. అహంతో నేనే కర్తను అని భావించుకుంటూ తమ పతనానికి తానే గోతిని తవ్వుకుంటూ ఉంటారు కనుక ఈ సృష్టిలో ఏది జరిగినా అంతా ప్రకృతి మయమనే, ప్రకృతే సర్వం, సర్వం ప్రకృతే అని భావించవలసి వస్తుంది. అందమైన ప్రకృతిని వీక్షించడం అంటే ఆ భగవంతుని చూడటమే. ప్రకృతికి మనం ఎంత దగ్గర అవుతామో అంత భగవంతునికి దగ్గర అయినట్లు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క ను నాటి దాని ఆవశ్యకతను తెలియజేస్తే మొక్కలు పట్ల అభిరుచి పెరుగుతుంది. విద్యార్థులలో కూడా ప్రకృతి అంటే జిజ్ఞాస కలుగుతుంది.

కనుమ ఎల్లారెడ్డి, పౌరశాస్త్ర ఉపన్యాసకులు.

## 137 టన్నుల బండ రాయి..

**పిల్లలు కూడా సింపుల్‌గా జరపగలరు.. కారణం తెలుసా?**

తన చిటికెన వేలితో కృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తినట్లు.. మీరు కూడా వంద టన్నుల బరువైన ఓ బండరాయిని కదిలించగలరు. ఆశ్చర్యపోనక్కర్లేదు.. ఫ్యాక్టే ఇది. ఫ్రాన్స్‌లోని హుయెల్‌గోట్ అడవిలో 'షేకింగ్ రాక్' పేరుతో ఓ బండరాయి ఉంది. ఏడు మీటర్ల పొడవు, 137 టన్నుల బరువైన ఈ రాయిని ఈ మధ్యనే శాస్త్రవేత్తలు గుర్తించి, ఓ ఆశ్చర్యకరమైన విషయాన్ని కనుగొన్నారు.. ఈ రాయిని కదిలించడానికి కండలు తిరిగిన శరీరం ఉండాల్సిన పనిలేదు.. పిల్లలు కూడా కదలించవచ్చు అని. కేవలం రాయి ఉండే కోణం, ప్రదేశం కారణంగానే ఇది సాధ్యమవుతోందని, అడవి నుంచి బయటకు తీసుకొస్తే ఆ ప్రత్యేకత పోతుందని బండరాయిని అక్కడే ఉంచారు. అప్పటి నుంచి రోజూ ఈ రాయిని చూడ్డానికి ఎంతోమంది వస్తున్నారు. మ్యాజిక్ చేసేవారు చిన్న చిన్న లాజిక్స్ ఉపయోగించి అసాధ్యాన్ని సుసాధ్యంగా భ్రమింప చేస్తున్నట్లు... మీరెప్పుడైనా ఫ్రాన్స్‌కు ప్రయాణమైతే అ అడవికి వెళ్లి చిన్న లాజిక్‌ను వాడి ఆ బండరాయిని కదిలించి ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపచేసుకోండి.





## మగువల మనసు దోచుకుంటున్న 'తంగ్కా' డిజైన్

జానపదుల కళారూపాల్లో ఆత్మ ఉంటుంది. బౌద్ధ కళలో ఆధ్యాత్మికత కూడా తోడవుతుంది. వేడుకలకు కాంతిమంతమైన రంగుల రంగేళీ జతగా చేరుతుంది. వీటి మేళవింపుతో చేసే పెయింటింగ్.. దారపు పోగులతో అల్లే అల్లికలు.. అద్దకం పనితనం.. ముత్యాల అలంకరణ.. గోటా అప్లిక్ వర్క్‌ల మెరుపుదనం అన్నీ ఈ డిజైన్లలో చూపితే అవి శీతాకాలపు ఫ్యాషన్‌గా ఇలా మన కళ్లముందు నిలుస్తాయి.

జానపద కళల వేడుకకు వేదికైన ఫ్యాషన్ హౌజ్ 'సౌంద్' విడుదల చేసిన కలెక్షన్ ఇది. సంప్రదాయ ఎంబ్రాయిడరీలు, మోటిఫ్‌లు, చేతితో చేసిన ఇతర అలంకరణలు, డిజిటల్ ప్రింట్లు ఈ డిజైన్లకు పండగల కళను తీసుకువచ్చాయి. దుపట్టా, అనార్కలీ, లాంగ్ కుర్తా, చీర కొంగు.. బౌద్ధ కళకు కాన్వాస్‌లు అవుతున్నాయి. వీటికి దేశమంతటా గల జానపద సంస్కృతిని ప్రతిఫలింపజేసే ఎంబ్రాయిడరీ, కచ్ వర్క్, గోటా పట్టీ, టాజిల్స్.. వంటి హంగులు అమరితే ఈ సీజన్‌ని మరింత కాంతిమంతంగా మార్చేస్తాయి. 'తంగ్కా' అనేది టిబెటన్ బౌద్ధ కళ. ఈ నమూనాలతో కనువిందు చేసే డిజైన్లు ఇప్పుడు అంతటా మగువలను ఆకట్టుకుంటున్నాయి.




మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
సోమవారం, నవంబర్ 25 2024

# శివతత్త్వం: నిత్యం.. సత్యం.. అనంతం

పరమశివుడు అర్ధనారీశ్వరుడు. ఆదిభిక్షువు. భక్త వత్సలుడు. బోళాశంకరుడు. నిర్వికారుడు, నిరాకారుడు, నిరాడంబరుడు. ఇన్ని వేదాంత లక్షణాలున్న ఈశ్వరుడు ఏ శివక్షేత్రంలో చూసినా లింగాకారంలోనే కనపడతాడు కాని శరీరాకృతిలో దర్శనమివ్వడు. అదెలాగంటే ఒక వృత్తం తన ఆకారంలో చాలా గొప్పది. అది అనంతమైన మోతాదులో పెరుగుతూ వెళ్లినా దాని కేంద్రం ఒక్కటే. పరిపూర్ణ తత్త్వమనేది ఒక గోళానికి చెందింది. పరిపూర్ణమైన దానిలోని భాగాలన్నీ పరిపూర్ణాలే అని తెలుసుకోగలగడమే ఆధ్యాత్మిక సాధన! అందుకే పౌరాణికవేత్తలు సృష్టి యావత్తూ శివలింగమేనంటారు. అన్ని స్పందనలూ, చేతనలూ ఈశ్వరుడిలోనే, ఈశ్వరుడి వల్లనే అంటారు! అందుకే అటు అనంతం ఇటు అనంతం, పైన అనంతం, కింద అనంతం చుట్టూ తిరిగి చూస్తే సర్వం లింగాకారమే... అదే శివతత్త్వం.

### ప్రతి చర్యలోనూ అంతులేనంతటి అంతరార్థం

శివుణ్ణి దిగంబరుడంటారు. దిగంబరుడంటే దిక్కులే వస్త్రాలుగా కలిగినవాడని అర్థం. అందుకే ఆయన సర్వాంతర్యామి అయ్యాడు. లోకంలో ప్రతివారు కీడును పోగొట్టుకోవడానికి, సంపదలు పొందడానికి మంగళకర ద్రవ్యాలైన సుగంధ చందనాదులను ధరిస్తారు. ఇవి మళ్లీ కోరికలు పుట్టిస్తాయి. కోరికలు లేనివాడయిన శివునికి వీటితో పనిలేదు. అందుకే అన్నింటికీ దూరంగా ఉంటాడు. భాగ్య వంతుడు కాకున్నా కోరిన వారికి సకల సంపదలను ప్రసాదిస్తాడు. సంచరించేది శ్మశానంలోనే అయినా, లోకాన్నిటినీ శాసించ గలడు. తనకే సంపదలూ లేకపో తేనేం, ఆయన అనుగ్రహమే గొప్ప సంపద. అంటే మనకు ఏమీ లేకపోయినా, అవతలి వారికి ఇవ్వాలన్న మనసు ఉంటే చాలనీ, పైపై ఆడంబరాలు లేకున్నా, గొప్ప కార్యాలు సాధించడానికి అదేమీ అడ్డం కాదన్నది ఆయన రూపంలోని, చర్యలలోని అంతరార్థంగా భావించాలి.



మహేశ్వరుని వంటి నిరాడంబరుడు మనకెక్కడా దర్శనమివ్వడు. గజచర్మం కట్టుకుంటాడు. చేతిలో కపాలం పట్టుకుని బిచ్చమెత్తుకుంటాడు. కాష్టాలవాడలో కాపురముంటాడు. విషపు నాగులను మెడనిండా మాలలుగా ధరిస్తాడు. రుద్రాక్షపూసల్ని వంటినిండా అలంకరించుకుంటాడు. ఆయన సిగలో చంద్రుడున్నాడని గొప్పలు పోదామంటే అదీ కుదరదు. ఆ శిరస్సున ఉండే చంద్రుడు వెన్నెల సోనలు కురిపించే నిండు చందురుడేమీ కాదు. సన్నని చంద్రరేఖ. పోనీ, సరైన వాహనమైనా ఉందా అంటే లేదు. ముసలి ఎద్దునెక్కి ఊరేగుతాడు. ఆయనని సేవించే పరిజనం ఏమైనా పెద్దవాళ్లా అంటే ప్రమద గణాలు, భూతగణాలే. అయితేనేం, వారితోనే ఆయన జగత్ ప్రసిద్ధుడయ్యాడు.

### మహా విరాగి

ఎంత పేదవారయినా సరే, పెళ్లికి పట్టుబట్టలు కట్టుకుంటారు, వంటికి చందనాలు అద్దుకుంటారు. సుగంధ పరిమళాలతో కూడిన పూదండలను అలంకరించుకుంటారు. వేగంగా సంచరించే పక్షినో, జంతువునో వాహనంగా చేసుకుంటారు. పెళ్లికి అందరూ రాగలిగేందుకు అనువైన ముహూర్తాన్ని చూసి పగలు లేదా సాయంత్రం పెళ్లి పెట్టుకుంటారు. కానీ, పరమ విరాగి అయిన శివుడేమో పెళ్లికి కూడా గజచర్మమే కట్టుకు తిరుగుతాడు. ముసలి ఎద్దునెక్కి వూరేగుతాడు. ఏ వాసనా లేని తుమ్మిపూలు చాలంటాడు. బూడిద పూసుకు తిరుగుతాడు. ఒక విందూ లేదూ, వినోదమూ లేదు. తన భక్తులు తనకు నవకాయ పిండివంటలు వండి నివేదించనక్కరలేదు. కటిక ఉపవాసముంటే చాలంటాడు. తనకోసం ఒక పూట మేలుకుని ఉంటే మంచిదంటాడు.

### అర్ధనారీశ్వరత్వం

శివుడెలా ఉంటాడో, ఆయన భార్య పార్వతి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. ఆయన గజచర్మమే చుట్టుకున్నా, ఆవిడ మాత్రం పట్టుబట్టలు కట్టుకుంటుంది. ఒంటినిండా నగలు ధరిస్తుంది. శ్రరీరానికి చందనం అద్దుకుంటుంది. సింహాన్ని వాహనంగా చేసుకుని నవరత్న ఖచిత సింహాసనంపై ఆసీనురాలవుతుంది. తనకు లేవు కదా అని ఆయన తన దేవేరి అయిన పార్వతిని పట్టుబట్టలు కట్టుకోవద్దనలేదు. ఆభరణాలు ధరించవద్దని కానీ, అలంకారాలు



చేసుకోవద్దని కానీ శాసించలేదు. ఆమెను ఆమెగా ప్రేమించాడు. తన శరీరంలో సగభాగాన్ని ఆమెకు ఇచ్చేశాడు.

శివతత్త్వాన్ని అలవాటు చేసుకోవడమంటే నిరాడంబర జీవితాన్ని ఎంచుకోవడమేనని వేదాంతులు, పండితులు చెబుతారు. ఎందుకంటే అది అనుభవంలోకి వస్తే తప్ప అర్థం కాదు. శివుడంటే ఒక వ్యక్తా? అతనికి ఒక ఆకారం ఉన్నదా? ఎక్కడో ఫలానా ప్రదేశంలో కూర్చుని ఉన్నవాడా? కాదు. సమస్త విశ్వమూ శివుడే. దేనిలో నుంచి అంతా వచ్చిందో, దేనిలో అంతా జీవిస్తున్నదో, తిరిగి దేనిలోనికి అంతా లయమైపోతున్నదో అదే శివతత్త్వం. దీని నుంచి బయటకు వెళ్లడానికి వీలుకాదు. ఎందుకంటే సృష్టి అంతా శివుడే. ఆయన విశ్వరూపుడు. అదే సమయంలో ఆయన రూపం లేనివాడు, నిరాకారుడు. ఒకవైపు రుద్రమూర్తి. మరోవైపు బోళాశంకరుడు. సుందరేశుడు ఆయన. సౌందర్యానికి అధిపతీ ఆయనే.అదే సమయంలో భయంకరమైన అఘోర రూపం కూడా ఆయనదే. ఆనంద తాండవంలో చైతన్య శీలతనూ, ధ్యానంలోని స్థిరత్వాన్నీ, చీకటినీ, వెలుగు నూ, అమా యకత్వాన్నీ, తార్కికబుద్ధినీ, దయాగుణాన్నీ.. అన్నింటినీ కలగలిపి ఒక్కటిగా పంచేదే శివతత్త్వం. ఇది ఒక లీల. విశ్వచైతన్యపు ప్రదర్శన. ఎలాగైతే నాట్యమూ, నాట్యకారుడూ విడివిడి గా ఉండ లేరో.. అలాగే సృష్టి, సృష్టికర్త వేర్వేరు విషయాలు కావు. ఈ సత్యమే నటరాజ స్వరూపంలో కనిపిస్తుంది. ఈ రూపంలో పంచభూ తాలు గోచరిస్తాయి. నటరాజు స్వయంగా చైతన్య స్వరూపం. ఆయన ఆనం ద నర్తనమే ఈ విశ్వం. ఆ సత్యమే శివతత్త్వం. ఆ ఆనందాన్ని అనుభవించగలిగే పర్వదినమే మహా శివరాత్రి. భక్తులు ఉపవాస జాగరణలు చేసేది ఆ అలౌకిక ఆనందాన్ని ఆస్వాదిం చేందుకే!

### మృత్యుంజయం

అత్యంత పవిత్రమైన మంత్రాలలో శివుని మృత్యుంజయ మంత్రం ఒకటి. మృత్యుంజయ అంటే చావుపై గెలుపు. ఆత్మకు చావు లేదు. అది ఒక శరీరం నుంచి మరొక శరీరానికి ప్రయాణిస్తుంది. మృత్యుంజయత్వం అంటే ఈ అశాశ్వతమైన జీవనంపై గెలిచి, మనసు శాశ్వతత్వానికి చేరుకోవడం. నేను శాశ్వతం, ఎన్నటికీ మార్పు చెందనిదేదో అది నాలో ఉన్నదని మనసు గ్రహిస్తుంది. అప్పుడు భయం ఉండదు. భయం అనేది మృత్యువుకు గల సంకేతాలలో ఒకటి. భయాన్ని జయించినపుడు ఈ అశాశ్వతమైన విషయాలను గుర్తుంచుకోవడం మానేసి, ఎన్నటికీ నాశనం కాని దానికోసం కదులుతాం. మనం ఈ రెండింటి కలయికగా ఉన్నాం. ఆత్మ... నాశనం లేనిది. శరీరం నశించిపోయేది. చాలాసార్లు మన మనసు శరీరానికి అంటిపెట్టుకుని తాను చనిపోతున్నానని భావిస్తూ ఉంటుంది. మనసును ఈ పరిమితమైన గుర్తింపు నుంచి అపరిమితమైన విశ్వవ్యాప్తమైన గుర్తింపు దిశగా మృత్యుంజయ మంత్రం తీసుకెళ్తుంది. ఈ మంత్రంలో ఒక ప్రార్థన ఉంది. ఆకాశమే కేశాలుగా గల అమిత బలవంతుడైన శివుడు మనల్ని బలవంతునిగా చేయుగాక. ఏ బంధాలూ లేని ఆ పరమ శివుడు మనల్ని అన్ని బంధాల నుంచి విముక్తుణ్ని చేయుగాక అని అంతరార్థం.

### మారేడుతో ఎందుకు పూజిస్తారు?

మహాశివుడికి మారేడు దళాలంటే మహా ఇష్టం. అందుకే మారేడును 'శివేష్ట' అని అంటారు. మారేడు ను బిల్వం అని కూడా అంటారు. బిల్వం అంటే శ్రీఫలం. అంటే లక్ష్మీదేవికి ఇష్టమైన ఫలాలను ఇచ్చేదనీ, సిరిని తెచ్చే ఫలం కలది అని అర్థం. మారేడు మంగళకరమైనది. మారేడు పత్రాలు త్రిశిఖలా ఉంటాయి. మూడు ఆకులతో ఉన్నందున త్రిశూలానికి సంకేతంగా భావిస్తారు. బిల్వపత్రాలతో పూజించడం వెనుక శాస్త్రీయత దాగి ఉంది. గాలిని, నీటిని శుభ్రపరచడంలో మారేడు ఆకులను మించినవి లేవు. ఈ చెట్టు గాలి శరీరానికి సోకినా, ఈ గాలిని పీల్చినా జబ్బులు రావు. బాహ్య, అంతర కణాలను శుద్ధి చేసి, శరీరాన్ని శ్రేష్ఠంగా ఉంచుతుంది. దేవాలయం గర్భగుడిలో గాలి సోకదు, సూర్యకిరణాలు ప్రసరించవు కనుక స్వచ్ఛత కోల్పోయే అవకాశం వుంది. అలాంటి వాతావరణంలో మారేడు ఆకులు స్వచ్ఛతను కలుగచేస్తాయి. అది మారేడు విశిష్టత. సూర్యుడిలో ఉండే తేజస్సు మారేడులో ఉంటుంది. శరీరం లోపలి భాగాల్లో, బయట వాతావరణంలో ఎక్కడ చెడు ప్రభావం ఉన్నా, దాన్ని హరిస్తుంది. మారేడు వల్ల తన భక్తులకు ఇన్ని ప్రయోజనాలున్నాయి కనుకనే మారేడంటే శివుడికి మహా ఇష్టం కా కాబోలు.

## తెమడ రంగును బట్టి జబ్బును ఊహించవచ్చు!



మనకు కొన్నిసార్లు దగ్గు వచ్చి తెమడ / కళ్లె / గల్ల పడుతుంటుందన్న విషయం తెలిసిందే. ఇలా తెమడ / కళ్లె / గల్ల పడటాన్ని తడి దగ్గు అంటుంటారు. ఇలా పడే తెమడ (కళ్లె) రంగును బట్టి రకరకాల వ్యాధులను కొంతవరకు అనుమానించి, వాటికి తగిన విధంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించవచ్చు.

ఉదాహరణకు తెమడ రంగు...

ఆకుపచ్చగా ఉంటే... దాన్ని సూడోమోనాడ్ అనే కుటుంబానికి చెందిన సూడోమొనాస్ అనే ఒక రకం బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వల్ల దగ్గు వస్తుండవచ్చు.

పసుపుపచ్చగా ఉంటే... క్లెబ్‌సిల్లా నిమోనియా తరహా ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు వచ్చే దగ్గుతో పాటు ఈ రంగులో తెమడ (కళ్లె) పడవచ్చు.

ఎర్రగా ఉంటే... సూడోమొనాలీ, నీమోకోకల్ వంటి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు ఎర్రరంగులో కళ్లెపడవచ్చు. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చినప్పుడు కూడా ఎర్రరంగు కళ్లె పడవచ్చు. అయితే ఇలా ఎర్రరంగు పడ్డప్పుడల్లా అది క్యాన్సర్‌కు సూచన అని అందోళన పడాల్సిన అవసరం లేదు. ఇలా కనిపించేవాళ్లలోనూ క్యాన్సర్ ఉండేవారి శాతం చాలా తక్కువ.

నల్లగా ఉంటే... కాలుష్యం బారిన పడటం, పొగతాగడం వంటివి జరిగి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ వస్తే అప్పుడు దగ్గుతో పాటు వచ్చే కళ్లె నల్లగా ఉండవచ్చు.

# భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ విహారం.. ఖండాంతరాలు దాటి..

**భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ... మన పక్షి ప్రేమికుడు సలీం అలీ మానసపుత్రిక. పక్షులు... ఖండాలు దాటి వస్తాయి. పర్యాటకులు... దేశాలు దాటి వస్తారు. పిల్లలు... ఏకంగా బడినే తెచ్చేస్తారు.**

భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ రాజస్థాన్‌లో ఉంది. ఈ ప్రదేశం దేశరాజధాని ఢిల్లీకి ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌కు సమదూరంలో ఉంది. ఆగ్రాలో తాజ్‌మహల్ చూసిన తర్వాత పశ్చిమంగా యాభై కిలోమీటర్లు ప్రయాణిస్తే భరత్‌పూర్‌లో ఉంటాం. ఏటా ఇక్కడికి సైబీరియా పక్షులు వస్తాయి. ఇక్కడ ఉన్నవి, అతిథులుగా వచ్చినవి కలిపి మొత్తం 370 పక్షిజాతులను చూడవచ్చు. అందుకే ప్రపంచంలోని ఆర్నిథాలజిస్టులు భరత్‌పూర్‌కి క్యూ కడతారు. ఏడాదికి లక్ష మంది పర్యాటకులకు తగ్గరు, వారిలో యాభై వేల మంది విదేశీయులే. స్కూలు పిల్లలైతే ఆ పరిసరాల జిల్లాలే కాదు ఢిల్లీ నుంచి కూడా ఎక్స్‌కర్షన్‌కి భరత్‌పూర్‌కి వస్తారు. పిల్లలకు వంద పేజీల పుస్తకంతో కూడా చెప్పలేనన్ని సంగతులను ఒక్క టూర్‌తో చెప్పవచ్చు. అందుకే బడి అప్పుడప్పుడూ అడవిలోకి వచ్చేస్తుంటుంది.

### ఏనుగు అంబారీ!

భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీలో ఎలిఫెంట్ సఫారీ, జీప్ సఫారీతోపాటు రిక్షా సఫారీ కూడా ఉంటుంది. పక్షులు శబ్దాలకు బెదిరి ఎగిరిపోకుండా ఉండాలంటే ఏనుగు మీద కానీ రిక్షాలో కానీ వెళ్లాలి. రిక్షావాలానే గైడ్‌గా వ్యవహరిస్తాడు. దట్టమైన అటవీప్రదేశంలోకి వెళ్లడానికి మాత్రం జీప్ సఫారీనే మంచి ఆప్షన్. ఇక్కడ సఫారీ పగలు మాత్రమే. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటలకు ముగుస్తుంది. బర్డ్ శాంక్చురీ ప్రవేశ ద్వారం దగ్గరే జీప్ బుక్ చేసుకోవాలి. మితిమీరిన శబ్దాలను, హారన్‌లను అనుమతించరు. సొంత వాహనంలో వెళ్లినా సరే శాంక్చురీకి రెండు కిలోమీటర్ల దూరంలో ఆ వాహనాన్ని వదిలి టూరిజం శాఖ వాహనాల్లోనే లోపలికి వెళ్లాలి. ఇక్కడ ఫొటోగ్రఫీ, వీడియో షూటింగ్‌ను అనుమతిస్తారు. కానీ ఎంట్రీ టికెట్‌తోపాటు కెమెరాలకు చార్జ్ చెల్లించాలి.

### వేటాడే అడవి కాదిప్పుడు

ఇది ఒకప్పుడు భరత్‌పూర్ రాజుల వేటమైదానం. బ్రిటిష్ వైస్రాయ్‌లు కూడా ఏటా ఇక్కడ డక్‌షూట్ నిర్వహించేవారు.

ఒక ఏడాది వైస్రా య్ లార్డ్ లినిత్‌గా వేటలో వేలాది పక్షులు వేట ఆనందానికి బలయ్యాయి.

ప్రసిద్ధ పక్షి ప్రేమికుడు సలీం అలీ కృషితో నలభై ఏళ్ల కిందట ఈ ప్రదేశం పక్షి సంరక్షణ కేంద్రంగా మారింది.

1985లో ఇది వర ల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందింది.

అడవిలో నేల రాళ్ల మయం. నున్నటి కాలిబాట వంటి రోడ్డు కూడా ఉండ దు. రాళ్లబాటలోనే నడవాలి. కాబట్టి ఈ టూర్‌లో మంచి షూస్ ధరించాలి.

ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, జైపూర్ టూర్ ప్లాన్‌లో భరత్‌పూర్ కూడా ఇమిడిపోతుంది.

ఇదే మంచికాలం!

ఖండాంతరాల నుంచి వచ్చే వలస పక్షులను చూడాలంటే అక్టోబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో వెళ్లాలి. ఆహ్లాదకరంగా వెకేషన్ కోసమే అయితే ఆగస్టు నుంచి నవంబర్ వరకు ఎప్పుడైనా వెళ్లవచ్చు. గడ్డకట్టే చల్లని వాతావరణం నుంచి సమశీతోష్ణమైన వాతావరణాన్ని వెతుక్కుంటూ వచ్చే ఈ పక్షులకు ఆరు నెలల పాటు మంచి విడిది భరత్‌పూర్ బర్డ్ శాంక్చురీ. ఏదైనా కారణం చేత ఒక ఏడాది నీటి నిల్వలు లేకపోయినట్లయితే ఈ పక్షులు నీళు న్న వేరే ప్రాంతాలను వెతుక్కుంటూ వెళ్లిపోతాయి. ఒకసారి ఈ చక్రం గాడి తప్పితే మళ్లీ పక్షులు ఈ ప్రదేశానికి రావడానికి చాలా ఏళ్లు పడుతుంది.

ఈ బర్డ్ శాంక్చురీ అసలు పేరు కేలాదేవ్ నేషనల్ పార్క్. ఈ పక్షి సంరక్షణ కేంద్రం భరత్‌పూర్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. అందుకే



భరత్‌పూర్ శాంక్చురీగా వాడుకలోకి వచ్చింది. ఆకాశంలో ఉండే ఇంద్రధనస్సు నేలకు దిగి పక్షుల రెక్కల్లో ఒదిగిపోయినట్లు ఉంటుంది. రంగురంగుల పక్షులు నీటిలో మునిగి చేపలు పట్టుకుని కడుపు నిండిన తర్వాత ఒడ్డుకు చేరతాయి. తడిసిన రెక్కలను విప్పార్చి సన్‌బాత్ చేస్తున్న దృశ్యం ఈ టూర్‌లో కనువిందు చేసే మరో ప్రత్యేకత.







printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095-9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..